క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

కొణిజర్ల: మండల పరిధిలోని అమ్మపాలెం పంచాయతీలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం (వైరా) విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్ల ఎంపికలో బీసీ గురుకులానికి చెందిన ఎ.మనోజ్, పి.బాలు ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపల్ బొడ్డు నాగమణి, ఏటీపీ రంజిత్‌కుమార్, పీఈటీ టి.భాస్కర్ అభినందించారు.

కానిస్టేబుల్‌కు ఉత్తమ ప్రతిభ అవార్డు



పెనుబల్లి: వీఎం.బంజరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావుకు 2023 సంవత్సరం రిసెప్షన్ డ్యూటీలో కనబర్చిన ఉత్తమ ప్రతిభకుగాను భారత ప్రభుత్వం అందించిన ఉత్కృష్ట సేవా పతకాన్ని మంగళవారం సీపీ సునీల్‌దత్ అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చింతకాని: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై వీరేందర్ హెచ్చరించారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి పెట్రోల్ బంకు వద్ద ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన లారీలకు మంగళవారం జరిమానాలను విధించారు. భారీ వాహనాలను నిలిపి ఉంచటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అకారణంగా వాహనాలను నిలిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఫ్రీజర్‌బాక్స్ వితరణ



తల్లాడ: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు పంచాయతీకి మంగళవారం ఫ్రీజర్‌బాక్స్ వితరణగా అందజేశారు. పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ లేక ఇతర గ్రామాల నుంచి తీసుకొస్తూ ఇబ్బంది పడుతుండటంతో గ్రామానికి చెందిన కానిస్టేబుళ్లు రూ.70 వేల విలువైన ఫ్రీజర్‌బాక్స్‌ను గ్రామ కార్యదర్శి సిద్దిక్‌మియాకు అందజేశారు. కానిస్టేబుళ్లు పసుపులేటి ప్రసాద్, ధనకొండ గోపాల్‌రావు, ఉపేందర్, ఎర్రి అంకంరావు, ముత్యాలరావు, శివ, శ్రీరామ్ పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) 401 సర్వేనెంబర్‌లో తండ్రి ద్వారా సంక్రమించిన స్థలంలో ఓ వ్యక్తి నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని నిర్మిస్తే కూల్చివేయడం గర్హనీయమని, సదరు దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పాస్టర్లు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. శిలువను అప్పగించాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఆమె ప్రభుత్వ భూమి అయిన 401 సర్వేనెంబర్‌లో తిరిగి ఏర్పాటు చేయొద్దని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వేముల సత్యం, కృష్ణమనోహర్, పి.రాజారత్నం, ఎర్నెస్ట్ పాల్, ప్రవీణ్, ఏసురత్నం, రూబెన్, రాంబాబు, అబ్రహం ఉన్నారు.

అయ్యప్ప మాలధారణ

వేంసూరు: మండలంలోని అడసర్లపాడు రామాలయంలో గురుస్వామి రావి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

నివాళి

కల్లూరు: సీపీఎం నాయకులు తన్నీరు లక్ష్మీనారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు మాదినేని రమేష్, నాయకులు పున్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చేతికి అందే ఎత్తులోనే..
- కారేపల్లి వీధుల్లో అడుగడుగునా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు


మసీదుకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న తీగలు


డీబీ సెంటర్ - జవ్వాజి బజార్ మార్గంలో ..


తీగలు కిందకు ఉండటంతో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇల్లు

కారేపల్లి: మండల కేంద్రంలోని ఏ వీధిలో చూసినా.. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతూ యమపాశాలుగా మారాయి. మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మల్లో, తీగలు ఒకదానికొకటి రాచుకుంటూ ప్రమాదభరితంగా మారాయి. చిన్నపాటి గాలిదుమారానికే విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాచుకుని స్పార్క్ ఏర్పడి ఫీజులు కొట్టివేస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన ఘటనలు లేకపోలేదు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో వినియోగదారులు అంధకారంలో మగ్గిపోవటం, దోమల రొదకు అనారోగ్యాలపాలవటం పరిపాటిగా మారింది. వచ్చిపోయే విద్యుత్‌తో గ్రామస్తులు విసుగుచెందుతున్నారు. దీంతో లో ఓల్టేజీ, హై ఓల్టేజీ సమస్యలతో ఇంట్లో ఎలక్ట్రికల్ గృహోపకరాలు కాలిపోయే పరిస్థితులు దాపురించాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొరపెట్టుకున్నా పట్టించుకోరా..?

విద్యుత్ తీగలు చేతికందే విధంగా కిందికి వేలాడుతున్నాయి. వచ్చిపోయే వాహనాలకు తగిలి విద్యుదాఘాతాలకు గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. గాలిదుమారానికి విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాచుకుంటూ.. మంటలు చెలరేగుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోని మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లకు అల్లుకుపోయి.. ఇల్లు కట్టలేని పరిస్థితిలో..

మండలకేంద్రంలోని రజక బజార్, అంబేద్కర్ బజార్, భారత్ నగర్, యాదవ బజార్, గణేష్ సెంటర్, గౌడ్‌ల బజార్, లాడీస్ బజార్, బీసీ కాలనీ, జంగల్ బజార్‌లలో విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా మారి ప్రమాదభరితంగా మారాయి. ముఖ్యంగా..

➡ కారేపల్లి సినిమాహాల్ సెంటర్ నుంచి మసీదు వైపు వెళ్లే రోడ్డులో డీబీ సెంటర్ వద్ద విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఇటీవల బస్సులో ఓ వివాహ వేడుకకు సుమారు 60 మంది పెళ్లి బస్సులో వస్తుండగా ఈ తీగలు తగిలే క్రమంలో స్థానికులు అప్రమత్తమై బస్సును నిలిపివేశారు. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

➡ ఇదే డీబీ సెంటర్‌లో జవ్వాజి బజార్‌కు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో పాటు, ఓ తుమ్మ చెట్టులో విద్యుత్ తీగలు అల్లుకపోయి ప్రమాదంగా మారింది.

➡ బొడ్రాయి సెంటర్‌లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో పాటు, ఇటీవల నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తాకేవిధంగా ఉన్నాయి. విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి ఇళ్లకు అడ్డురాకుండా చేయాలని అధికారులకు ఇళ్ల లబ్ధిదారులు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో నిర్మాణాన్ని పునాదుల వరకే నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇల్లు కట్టుకుందామని ఆశతో ప్రారంభిస్తే విద్యుత్ తీగలు ఆటంకంగా మారాయని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీగలు అడ్డున్నాయని ఇల్లు ఆగింది..



కరెంట్ తీగలు అడ్డు వస్తున్నాయని మేస్త్రి ఇల్లు కట్టడం ఆపిండు. ఇప్పటి వరకు ఇల్లు నిర్మాణం పిల్లర్లు పోయాలంటే చేతికందే ఎత్తులో ఉన్న తీగలు తగులుతాయని పనోళ్లు భయపడుతున్నారు. పెద్ద సార్లకు కూడా చెప్పినం అయినా పట్టించుకోవట్లేదు. మాతో ప్రారంభించిన వాళ్ల ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు వచ్చాయి. పెద్దసార్లు పట్టించుకోని మా సమస్య పరిష్కారం చూపాలి.

– ఆరెల్లి తిరపమ్మ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు

ఏ వాహనం వచ్చినా భయమే..



కారేపల్లి వీధుల్లో విద్యుత్ తీగలు తగిలేలా కిందికి ఉన్నాయి. ఇటీవల ఓ పెళ్లి బస్సు తీగలు తాకేలోపు ఆపాము. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగేది. ఇప్పటికైనా చెట్ల కొమ్మలకు తగిలేటట్లు ఉన్నా కరెంట్ తీగలను సరి చేయాలి. పాత స్తంభాలకు ఇనుప ఊచలు బయటపడి కరెంట్ సరఫరా అయ్యి ప్రమాదం ఉంది. పాతకాలం కరెంట్ స్తంభాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలి.

– పాసిని నాగేశ్వరరావు, కారేపల్లి

డీలర్లు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

ఏన్కూరు: మండలంలోని విత్తన, పురుగు మందుల దుకాణాల డీలర్లు ఎప్పటికప్పుడు తమ రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, లైసెన్సులు పునరుద్ధరించుకుని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ సూచించారు. మంగళవారం ఏన్కూరులోని రైతువేదిక భవనంలో మండలంలోని ఇన్‌పుట్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డీలర్లు ప్రతీ నెలా 5 లోగా విత్తన అమ్మకాలకు సంబంధించి ఫాం డీ ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఆడ మగ రకం మొక్క జొన్న సీడ్ వేసే రైతులు ముందుగా సదరు కంపెనీతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే బాండ్ తీసుకుని విత్తనాలు వేయాలన్నారు. ఏఓ ఎ.నరసింహారావు సీసీఐ పత్తి కొనుగోలు ప్రక్రియ, కిసాన్ కంపాస్ యాప్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాగ్యలహరి, డీలర్లు పాల్గొన్నారు.

పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేయాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. కల్లూరులో తన్నీరు కృష్ణార్జున్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సంఘం సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని, మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉపాధి పథకానికి 200 రోజులు పని దినాలుగా పెంచాలని, రోజు కూలీ రూ.800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్, సంఘం తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి మండల కార్యదర్శులు పులి కృష్ణయ్య, గాయం తిరుపతిరావు, కువ్వారపు లక్ష్మణరావు, చల్లా నాగేశ్వరరావు, అల్లి రమేష్, చిమట విశ్వనాథం, రాజనేని మంగమ్మ, ఎస్‌కె నన్నే సాహెబ్, పిల్ల నాగమణి, ఎలగం రాములు, కంచపోగు జమలయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు


మాట్లాడుతున్న తహసీల్దార్ సాంబశివుడు

కల్లూరురూరల్: మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు మంగళవారం కల్లూరులో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి బుధవారం నుండి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ పులి సాంబశివుడు మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరికోతలు ప్రారంభమైన దృష్ట్యా మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారిణి ఎం.రూప మాట్లాడుతూ... గతేడాది 31 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఐకేపీ ఏపీఎం మహాలక్ష్మి, పీఏసీఎస్ సీఈఓలు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలి


మాట్లాడుతున్న విఠల్‌రావు

పెనుబల్లి: వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం, పంట బీమా అమలు చేయటం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు ఆరోపించారు. స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు చిట్టిమోదుల కృష్ణ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. పంటలు చేతికొచ్చిన సమయంలోనే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తడికమళ్ల చిరంజీవి, గుడిమెట్ల బాబు, చిన్నవెంకన్న, కండే సత్యం, ప్రసాద్, రవీంద్ర, నాగేశ్వరరావు, గోవులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

చింతకాని: బీసీ రిజర్వేషన్ల సాధనకు ఈనెల 18న నిర్వహించనున్న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి గోదా రవీందర్ కోరారు. మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో తెలంగాణ బంద్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. నాయకులు బండి వీరయ్య, గోదా రామారావు, హనుమంతురావు, ఉదయ్, సతీష్, రామకృష్ణ, చందర్‌రావు, సైదులు, వెంకటేష్, లక్ష్మీపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రుపాలెం: కిశోర బాలికలకు అందించాల్సిన పోషకాహారంపై తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు రక్తపరీక్షలు చేశారు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, రాధ, యోగేశ్వరి, ఆదిలక్ష్మి, హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది మౌనిక, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి అన్నారు. పట్టణంలోని జలగంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు స్వాతి, మంగ, అరుణ, వీరకుమారి, తామారు, రహ్మతున్నీసా పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం


వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన రోగిని వైద్యసేవలు అందించి ఆరోగ్యంగా కోలుకునేలా చేసిన సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రి వైద్యులను మంగళవారం సన్మానించారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన వేముల జగన్ గత నెల 19న మల్టీఆర్గాన్ వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యం బాగా క్షీణించి ఆస్పత్రిలో చేరగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో డాక్టర్ సురేష్ నారాయణ్ వైద్యసేవలు అందించగా జగన్ కోలుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులు వెంకటేశ్వర్లు, సురేష్‌నారాయణ, ప్రణయ్‌లను సత్కరించారు.

పరిశుభ్రత పాటించాలి


శానిటరీ ప్యాడ్స్ అందజేసిన సుధారాణి

సత్తుపల్లిరూరల్: ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి అన్నారు. మంగళవారం మండలంలోని తుంబూరు ప్రభుత్వ పాఠశాలలో ఆడపిల్లలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనతను అధిగమించడానికి పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తల్లాడ: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణా రైతు సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తల్లాడ, మల్లారం గ్రామాల్లో పత్తి, వరి పంటలను పరిశీలించారు. పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాల వల్ల గూడ, పిందె రాలి పోయిందని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సంఘం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వర్‌రావు, గుంటుపల్లి వెంకటయ్య, ఎస్.మోహన్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలపై అసంతృప్తి..


పార్టీలో చేరిన వారితో కమల్‌రాజ్

చింతకాని: కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అసంతృప్తి చెంది బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్ అన్నారు. మండలపరిధిలోని తిరుమలాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు బండి రామారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, నాయకులు గురిజాల హనుమంతురావు, వంకాయలపాటి లచ్చయ్య, మంకెన రమేష్, గద్దం శ్రీను, పర్చగాని ఏడుకొండలు, షేక్ మదార్ సాహెబ్, గోగుల నర్సింహారావు, నాదెండ్ల వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు 'గాలికుంటు' టీకాలు

మధిర: ఈ నెల 15 నుంచి నవంబర్ 15 వరకు అన్ని గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు వేయనున్నట్లు మధిర పశువుల ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ పండరీ బాబు, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉమా కుమారి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మధిర ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో పశువైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారేపల్లి: మండలంలోని గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం బుధవారం నుంచి నవంబర్ 11 వరకు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి మద్దెబోయిన ఉపేందర్ తెలిపారు. గ్రామాల్లో పశు వైద్య బృందాలు సంచరించి టీకాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని గ్రామాల్లో నేటి నుండి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఆవులకు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ కె.మమత తెలిపారు. పాడి రైతులకు పశువుల పెంపకం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని డాక్టర్ మమత తెలిపారు.

సంతకాల సేకరణ

పెనుబల్లి: ఓటు చోరీపై మండలంలోని పాతఅగ్రహారం గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. దేశిన్ని శ్రీనివాస్‌గౌడ్, మూడే బద్దు, మిద్దె చెన్నకేశవులు, వేముల సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన గ్రామ రాశి ఆంబోతు మృతిచెందడంతో మంగళవారం డప్పు మేళతాళాలతో అంత్యక్రియల నిమిత్తం ట్రాక్టర్‌లో ఊరేగించారు. అనంతరం కట్లేరు సమీపంలో ఖననం చేశారు.


నగదు రహిత లావాదేవీలపై అవగాహన

వేంసూరు: మండల పరిధిలోని కల్లురుగూడెం గ్రామంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు సెర్ప్ ఆధ్వర్యంలో మంగళవారం నగదురహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఐకేపీ సీసీలు మోరంపూడి ప్రసాద్, సోమరాజు ప్రసాద్, షబ్బీర్, సీఆర్‌పీ పద్మజదేవి, సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై ..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం డ్రగ్స్‌పై వాటి వల్ల నష్టాలపై అవగాహన కల్పించారు. ఉమెన్ హబ్ జిల్లా, నషాముక్తభారత్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్లు ఎండీ.సమ్రీన్, మానస, కె.బాబు, ఫైనాన్షియల్ థెరపీ నిపుణుడు సతీష్, ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపల్ యం.నవ్య, కో ఆర్డినేటర్లు డాక్టర్ కేపీ.ఐశ్వర్య, రజిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్ విజయవంతం



మధిర: పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో మంగళవారం అప్పర్ కిండర్ గార్డెన్ (యూకేజీ) పిల్లలతో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విజయవంతమైంది. ప్రాజెక్టులను తల్లిదండ్రుల సహకారంతో చిన్నారులు తయారుచేయగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తిలకించారు. కరస్పాండెంట్ మేరీ థామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బేటీ, ప్రైమరీ కో ఆర్డినేటర్ సిస్టర్ ఎల్‌సీ థామస్, అకాడమీ కో ఆర్డినేటర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

సత్తుపల్లి: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మంగళవారం కలిశారు. ఈ మేరకు సత్తుపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రతిపాదనలు అందజేసి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

వైఎస్‌ఆర్‌సీపీ ఎన్నారై కో ఆర్డినేటర్‌ను..


సాంబశివరెడ్డితో ఎన్నారైలు

వేంసూరు: వైఎస్‌ఆర్ సీపీ ఎన్నారై కో ఆర్డినేటర్ ఆలూరి సాంబశివరెడ్డిని మండల పరిధిలోని అడసర్లపాడు గ్రామానికి చెందిన ఎన్నారైలు అట్లూరి ప్రసన్న కుమార్ రెడ్డి, పూనూరు సురేందర్ రెడ్డి, వంశీకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి మంగళవారం విజయవాడలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత అందించాలి


బ్యాగులు, నోట్ పుస్తకాలతో విద్యార్థులు

ఏన్కూరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు చేయూత అందించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. మార్పు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గుడిమెట్ల రజిత, మోహనరావు దంపతుల పెద్దకుమారుడు గుడిమెట్ల వెంకటరామన్ జన్మదినం సందర్భంగా మంగళవారం మండలంలోని జన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము సుధాకర్, అడపా రామారావు, నేలపట్ల బాబు, పుచ్చకాయల వెంకన్న, సాదం దివ్య, కుదురుపాక నాగమణి, సరస్వతి, తిరపతయ్య, రజిత, మోహనరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

చింతకాని: మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన అమరనేని వెంకటి పాడి గేదె ఇటీవల పొలంలో విద్యుదాఘాతంతో మృతిచెందగా విద్యుత్‌శాఖ చెక్కు అందజేసింది. ఈ మేరకు మంగళవారం పెద్దగోపతి ఏడీఏ తిలక్ రూ.40 వేల చెక్కును వెంకటికి అందజేశారు. ఏఈ ఉమామహేశ్వరి, బొర్రా ప్రసాద్‌రావు, తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు రక్షణ

సాక్షి ఎఫెక్ట్..


రక్షణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో హరితహారం మొక్కలకు మంగళవారం రక్షణ చర్యలు చేపట్టారు. 'లక్ష్యం ఘనం .. ఆచరణ శూన్యం' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని స్పందించారు. ఈ మేరకు కల్లూరు నుండి చిన్నకోరుకొండి వెళ్లే రోడ్డు ఇరువైపులా రహదారిపై చెన్నూరు వద్ద మొక్కలు ముళ్ల కంచె, కర్రలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా లింగాల, తెలగవరం, మర్లపాడు, ముగ్గు వెంకటాపురం, పెద్దకోరుకొండి, ముచ్చవరం తదితర పంచాయతీల్లో రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టనున్నారు.